ప్రజాశక్తి
మంగళవారం 19 నవంబర్ 2024
5
శ్రీ సత్యసాయి

ర్యాలీ చేస్తున్న ఆశాలు

# సైలెంట్‌గా 'స్మార్ట్ మీటర్లు'

స్మార్ట్ మీటర్లు

## ◆ చాపకింద నీరులా మీటర్ల బిగింపు
## ◆ ప్రభుత్వ కార్యాలయాలకే కాకుండా దుకాణాలకు ఏర్పాటు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

సైలెంట్‌గా స్మార్టు మీటర్ల బిగింపు జరుగుతోంది. మొదట ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితమేనని చెప్పినప్పటికీ చాపకిందనీరులా ప్రయివేటు దుకాణాలకు బిగింపు మొదలైంది. అనంతపురం నగరంలో ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో స్మార్టు మీటర్లు బిగింపు ప్రారంభమైంది. అనంతపురం నగరంలోని రుద్రంపేట బైపాస్ సమీపంలోని ఐదు దుకాణాల్లో స్మార్టు మీటర్లను బిగించారు. నగరంలోని వీధిలైట్లకు కూడా స్మార్టు మీటర్ల బిగిస్తున్నారు. ప్రతి వీధికి ఒక మీటరు చొప్పున ఏర్పాటు చేస్తున్నారు.

**మూడు నెలల తరువాత యాక్టివేషన్**

ఇప్పుడు మీటర్లు ఏర్పాటు చేసినప్పటికీ రీఛార్జీ ప్రక్రియ మాత్రం మూడు మాసాల తరువాత ప్రారంభమవనుందని అధికారులు చెబుతున్నారు. ఇది అమల్లోకి వచ్చాక పరిస్థితి ఏమిటన్న సందేహాలు అందరిలోనూ ఉన్నాయి. దీనిపైన అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా ప్రభుత్వ కార్యాలయాలు, నగర పాలక సంస్థ వీధిలైట్లు రీఛార్జీ సకాలంలో చేయకపోతే విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశముందన్న అనుమానాలున్నాయి. ఆచరణలో అమల్లోకి వస్తే కొత్త సమస్యలు తెరపైకొచ్చే అవకాశముంది.

**కూటమి నేతలు మౌనం**

ఎన్నికల ముందు వరకు స్మార్టు మీటర్లకు వ్యతిరేకమని ప్రకటించిన తెలుగుదేశం పార్టీ నాయకులు. ఇప్పుడు దీనిపై మౌనంగా ఉంటుండటం గమనార్హం. గతంలోనే నుంచి సిపిఎం, రైతు సంఘాలు స్మార్టు మీటర్లకు వ్యతిరేకంగా నిరసనలు సైతం చేపట్టడం జరిగింది. దీనికి టిడిపి కూడా అప్పట్లో మద్దతునిచ్చింది. అయితే అధికారంలోకి వస్తే లేకుండా చేస్తామని హామీనిచ్చారు. సిపిఎం మాత్రం దీనిపై నిరసనలకు సిద్ధమవుతోంది. స్మార్టు మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**స్మార్టు మీటర్లు ఏర్పాటు ఆపాలి**

ప్రజలపై భారాలు మోపేందుకు స్మార్టు మీటర్ల ఏర్పాటు ఆపాలి. గత ప్రభుత్వ హయాంలో అమలు చేయాలనుకున్న విధానాలనే ఈ ప్రభుత్వం అవలంభించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ట్రూఆఫ్ ఛార్జీల పేరుతో భారాలు మోపుతోంది. స్మార్టు మీటర్లతోనూ అదనపు భారం వేయాలని చూడటం సరైంది కాదు. ఇప్పటికైనా స్మార్టు మీటర్లను ఏర్పాటును నిలిపివేయాలి.

**వి.రాంభూపాల్,**
**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు.**

# ఆశాల ఆగ్రహం..!

◆ కలెక్టరేట్ వద్ద ధర్నా
◆ ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్
◆ అధికారులకు వినతిపత్రం అందజేత

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

ఎన్నికల హామీ మేరకు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశా కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐటియు ఆశ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆశాలు ఆర్టీసీ డిపో నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ బైఠాయించి నిరసన తెలిపారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సాంబశివ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జిఎల్.నరసింహులు, జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 2024 ఫిబ్రవరి చలో విజయవాడ కార్యక్రమంలో అప్పటి ప్రభుత్వం ఆశ యూనియన్ నాయకులతో చేసుకున్న ఒప్పంద ప్రకారం జీవోలు అమలు చేయాలన్నారు. ఆశాలకు సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.6లక్షలు బీమా ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ కాలం 62 ఏళ్ల కు పెంచాలన్నారు. ఉద్యోగ విరమణ సందర్భంగా లక్ష రూపాయలు ఇవ్వాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. కేవలం రూ.10 వేల వేతనంతో ఎలా పనిచేయాలని ప్రశ్నించారు. కరోనా సమయంలో ప్రాణాలను తెగించి ఆశాలు గర్భిణులకు సేవలు అందించారన్నారు. అనేక రకాలుగా ప్రభుత్వం, ప్రజల మధ్య వారిధిగా ఆశలు ఉంటూ సేవలు అందించారన్నారు. చలో విజయవాడ సందర్భంగా అప్పటి వైసిపి ప్రభుత్వం పది డిమాండ్లను ఒప్పుకుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో చంద్రబాబు నాయుడు ఆశల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఐదు నెలలు అవుతున్నా ఆశల సమస్యలను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో కూడా ఆశాల సంక్షేమంపై ఎలాంటి ప్రకటన లేకపోవడం విచారకరం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆశాల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించుకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ డిఎంహెచ్ఒ తిప్పేంద్ర నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి సౌభాగమ్మ, ఉపాధ్యక్షురాలు రమాదేవి, సిఐటియు స్థానిక నాయకులు పైపల్లి గంగాధర్, బాబావలి తదితరులు పాల్గొన్నారు.

బాబా జయంతి రథోత్సవంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

# సత్యసాయి జయంతి ఉత్సవాలు ప్రారంభం

◆ రథోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు
◆ అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సవ విగ్రహాల పల్లకి మోస్తున్న రత్నాకర్, మాజీ మంత్రి పల్లె

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

పట్టణంలో వేణుగోపాల స్వామి రథోత్సవంతో సత్యసాయి బాబా జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. ప్రశాంతి నిలయంతో పాటు పట్టణంలోని దుకాణాలు హోటళ్లు ప్రత్యేక అలంకరణలు చేశారు. సోమవారం వేణుగోపాల స్వామి గుడి నుంచి రథోత్సవాన్ని గోపురం గేటు వరకు భక్తులు లాగారు. సాయి కుల్వంత్ హాలులో సత్యనారాయణ వ్రతం పూర్తి కాగానే అక్కడి నుంచి పల్లకీలు సీతారాముల ఉత్సవ విగ్రహాలను పల్లకీలు తీసుకొచ్చి రథంలో ప్రతిష్టించారు. ఈ పల్లకిని సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ట్రస్టు సభ్యులు మోసారు. అనంతరం అక్కడి నుంచి తిరిగి వేణుగోపాల స్వామి గుడి వరకు భక్తులు రథన్ని భక్తి పరవశంతో లాగారు. ఈ కార్యక్రమం తిలకించడానికి దేశ విదేశీ భక్తులతో పాటు పుట్టపర్తి పరిసర ప్రాంతాల నుంచి వేలాది మందిగా ప్రజలు తరలివచ్చారు. ఈ రథోత్సవం ముందు భాగంలో కీలుగుర్రాలు, గురవయ్య నత్యాలు, నెమలి నత్యాలు, కోలాటాలు, చెక్క భజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. ఎస్పీ రత్న ఆధ్వర్యంలో పలువురు డీఎస్పీలు, సిఐలు ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు.

**ప్రశాంతి నిలయంలో ఉచిత అన్న ప్రసాదాలు**

ప్రశాంతి నిలయం వెస్ట్ గేట్ వైపు సోమవారం ఉచిత అన్నదాన ప్రసాదాలు సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ ట్రస్టు సభ్యులు ప్రారంభించారు. ఈనెల 18 నుంచి 23 వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఎంతమంది పాల్గొన్న అందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించడానికి ట్రస్టు అన్ని చర్యలు చేపట్టింది.

## ప్రజల సమస్యలు తక్షణం పరిష్కరించండి : ఎస్పీ

**పుట్టపర్తి రూరల్ :** పోలీసు శాఖ దృష్టికి వచ్చిన ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వి.రత్న ఆదేశించారు. పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించారు. కుమార్తెలు పుట్టినందుకు కాపురానికి రానివ్వట్లేదని గంటాపురం బత్తలపల్లి గ్రామానికి చెందిన అశోక్ భార్య జ్యోష్ణ ఆవేదన వ్యక్తం చేసింది. డెవలప్‌మెంట్ పేరుతో తమ 15 సెంట్ల స్థలం తీసుకుని ఒప్పందాన్ని తుంగలోతొక్కి మోసం చేయడంతో పాటు చంపుతామని బెదిరి స్తున్నారని బాధితురాలు నాగమణి పుట్టపర్తిలోని సాయిరుషి రెసిడెన్సీ వారిపై ఫిర్యాదు చేసింది. తన భూమిలోకి వెళ్లడానికి అగ్రవర్ణాల వారు అడ్డుపడుతూ దౌర్జన్యానికి దిగుతు న్నారని న్యాయం చేయాలని గాండ్లపెంట మండలంలోని కటారుపల్లి గ్రామానికి చెందిన దళిత వెంకట రమణ విన్నవించుకున్నాడు. కార్యక్రమంలో పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఎస్‌బి ఎస్ఐ.ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలధారులకు అన్నదానం

**హిందూపురం :** పట్టణంలో బెంగళూరులో రోడ్డులో వెలిసిన అయ్యప్ప దేవాలయం అన్నదాన భవనంలో మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వామి మాలధారణ భక్తులు, ఇతర స్వాములకు మధ్యాహ్నం భోజనం కల్పించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నదాన కమిటీ అధ్యక్షులు డిఈ.రమేష్ కుమార్, దుర్గనవీన్ పాల్గొన్నారు.

# కనకదాస జీవితం సమాజహితం

◆ చైతన్యం చేసిన ఆయన కీర్తనలు
◆ జయంత్యుత్సవాల్లో మంత్రి సవిత
◆ అనంతలో రాష్ట్ర స్థాయి వేడుకలు

భక్తకనదాస చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సవిత, ఎంపీ, ఎమ్మెల్యేలు

మాట్లాడుతున్న మంత్రి సవిత

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

శ్రీ భక్తకనకదాస జీవితం సమాజ హితం కోరుతూ కొనసాగిందని, ఆయన కీర్తనలు ప్రజలను చైతన్యం చేశాయని రాష్ట్ర బిసి, చేనేత సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలియజేశారు. అనంతపురం నగరంలోని గుత్తి రోడ్డు కెటిఆర్ కన్వెన్షన్ హాల్లో శ్రీ భక్త కనకదాస రాష్ట్రస్థాయి జయంత్యుత్సవాలను సోమవారం వైభవంగా నిర్వహించారు. అంతకు మునుపు గుత్తి రోడ్డులో ఉన్న కనకదాస విగ్రహానికి మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిసి, చేనేత సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, అనంతపురం, హిందూపురం ఎంపీలు అంబిక లక్ష్మీనారాయణ, బికె.పార్థసారథి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, పరిటాల సునీత, అమిలినేని సురేంద్రబాబు, కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, రాష్ట్ర బిసి.వెల్ఫేర్ ప్రిన్సిపాల్ సెక్రటరీ పోలా భాస్కర్, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ సంచాలకులు, మేనేజింగ్ డైరెక్టర్ డా॥ఎ.మల్లికార్జున కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎస్.సవిత మాట్లాడుతూ భక్త కనకదాస అందరూ కలిసికట్టుగా ఉంటే ఏదైనా సాధించవచ్చని చెప్పారన్నారు. ఊరురా కీర్తనలు చేస్తూ ప్రజలను చైతన్యం చేశారన్నారు. రాష్ట్రంలో బీసీలు, బలహీన వర్గాల వారికి తెలుగుదేశం పార్టీ అండగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కురుబలను రాజకీయంగా, ఆర్థికంగా ముందుకు తీసుకువచ్చారన్నారు. బీసీలను గుర్తించి వారు అన్ని రంగాల్లో ముందుండాలని కోరుకునేది తెలుగుదేశం పార్టీ అన్నారు. జిల్లాలో రెండు ఎంపీ స్థానాలు బిసిలకు ఇచ్చి, తనను మంత్రిగా చేశారని తెలిపారు. కురుబలు షీఫామ్ పెట్టుకుని వ్యాపారాలు చేస్తున్నారని, వారికి రూ.50 లక్షల రుణాలు ప్రతి యూనిట్‌కు ఇవ్వనున్నట్లు తెలిపారు. అందులో 10 శాతం లబ్ధిదారుని వాటా, 40 శాతం సబ్సిడీ, 50 శాతం బ్యాంకు రుణం వస్తుందన్నారు. ఎంపీ అంబికా లక్ష్మినారాయణ మాట్లాడుతూ కురుబ కనకదాస కళ్యాణ మండపానికి రూ.20 లక్షల ఎంపీ నిధులు కేటాయిస్తామన్నారు. ఎంపీ బికె.పార్థసారధి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు భక్త కనకదాసు జయంతిని అధికారికంగా నిర్వహించాలని చంద్రబాబుని అడిగితే ఆయన హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేరుస్తూ అధికారికంగా కనకదాసు జయంతిని అనంతపురంలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కురుబలందరూ సమానంగా ఎదిగి హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ డిడి ఖుష్బు కొఠారి, ఆర్డీవో కేశవనాయుడు, డిటిడబ్ల్యూఓ రామాంజనేయులు, డీఆర్డీఏ పీడీ ఈశ్వరయ్య, తహశీల్దార్ హరికుమార్, సిపిఐ రాష్ట్ర నాయకులు జగదీష్, జిల్లా కురుబ కుల సంఘాల నాయకులు తిప్పటి ఈశ్వరయ్య, తగరకుంట కృష్ణమూర్తి, ఆంజనేయులు, ఆవుల కృష్ణయ్య, గంగులకుంట రమణ, సీనయ్యతో పాటు ఉమ్మడి జిల్లాలోని కురుబలు పాల్గొన్నారు.

**భక్త కనకదాసు జీవితం**
**నేటి తరాలకు ఆదర్శం : కలెక్టర్**

**పుట్టపర్తి క్రైమ్ :** మహా కవి, సంగీత కళాకారుడు, స్వరకర్త శ్రీ భక్త కనకదాస జీవితం నేటి తరాలకు ఆదర్శమని కలెక్టర్ టిఎస్.చేతన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక గణేష్ సర్కిల్‌లోని సాయి ఆరామం ఫంక్షన్ హాల్లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కనకదాసు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మలజ్యోతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సమాజం మార్పు కోసం ఆనాడే కనకదాసు కషి చేసిన మానవతా మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, నాయకులు మల్లికార్జున, చెన్నప్ప, రమేష్, జగదీష్ పాల్గొన్నారు.

# పట్టుగూళ్ల మార్కెట్‌కు మహర్దశ..!

**తొలి విడతగా రూ.4 కోట్లు మంజూరు - త్వరలో నూతన భవనాలకు శంకుస్థాపన**

శిథిలావస్థకు చేరుకున్న పట్టుగూళ్ల విక్రయ కేంద్రం

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం పట్టణంలోని పట్టుగూళ్ల మార్కెట్‌కు మహర్దశ రానుంది. శిథిలావస్థకు చేరుకున్న భవన సముదాయాల స్థానంలో అధునాతన హంగులతో నూతన మార్కెట్ నిర్మాణానికి సెంట్రల్ సిల్క్ బోర్డు రూ.4 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు సంబంధించి అధికారులు తెలిపారు. ఈ నిధులకు 50 శాతం వాటా కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.4 కోట్ల నిధులు సమకూరిస్తే త్వరలోనే పనులు ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం, గ్రామోదయ నిధుల కింద ప్రస్తుతం ఉన్న మార్కెట్ గోదాము నిర్మాణానికి 1985 డిసెంబర్ 1వ తేదీన అప్పటి జిల్లా మంత్రి రామచంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. రెండేళ్ల కాలంలోనే మార్కెట్ నిర్మాణ పనులు పూర్తికాగా 1987 సెప్టెంబర్ 14వ తేదీన అప్పటి స్థానిక ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి ఎన్‌టి.రామారావు ప్రారంభించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ఈ మార్కెట్‌లో పట్టుగూళ్ల విక్రయాలు కొనసాగుతున్నాయి. హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్ దేశంలోనే పట్టుగూళ్ల విక్రయాల్లో అగ్రగామిగా రికార్డు సష్టించింది. ఈ గోదాము శిథిలావస్థకు చేరుకోవడం, వర్షం వస్తే నీరంతా మార్కెట్‌లోకి చేరుతుండడంతో ఇటు అధికారులు అటు పట్టుగూళ్ళను తీసుకొచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పట్టు రైతులు, రీలర్లు నూతన భవనాలను నిర్మించాలని వివిధ దశల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందుకు సెంట్రల్ సిల్క్ బోర్డు అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నూతన మార్కెట్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించడంతో రోడ్లు భవనాల శాఖ ఇంజినీర్లు రూ.8 కోట్లతో నూతన భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు చేశారు. ఈ విషయాన్ని సంబంధ ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో సెంట్రల్ సిల్క్ బోర్డు 50శాతం నిధులను మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద మరో 50శాతం నిధులు మంజూరు చేస్తే భవన నిర్మాణాలు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. పట్టుగూళ్ల మార్కెట్ స్థానికంగా ప్రారంభించడంతో అప్పట్లో రైతులు అధిక సంఖ్యలో మల్బరీ పంట సాగుపై దష్టి సారించారు.

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా హిందూపురం ప్రాంతంలో మల్బరీ పంట సాగు విస్తీర్ణం ఏడాదికి ఏడాది పెరుగుతూ వచ్చింది. కర్నాటక ప్రాంతం కంటే ఈ ప్రాంతంలో ధరలు ఆశాజనకంగా ఉండడంతో అనేక మంది రైతులు తమ పట్టుగూళ్లను ఇక్కడికి తీసుకువచ్చి విక్రయాలు చేస్తుంటారు. స్థానికంగా ఉన్న పట్టుగూళ్ల విక్రయ కేంద్రాన్ని దష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం హిందూపురం సమీపంలోని కిరికెర వద్ద కేంద్ర పట్టు పరిశోధన కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసింది. ఈ పరిశోధనా కేంద్రంలో నూతన మల్బరీ వంగడాలను ఉత్పత్తి చేసేందుకు అవసరమైన విధానాలపై శాస్త్రవేత్తలు పరిశోధనలు సాగిస్తుంటారు. తర్వాత వాతావరణ పరిస్థితులు, మల్బరీ సాగుపై ప్రభుత్వం పెద్దగా దష్టి సాగించకపోవడం తదితర అంశాల నేపథ్యంలో సాగు విస్తీర్ణం తగ్గుముఖం పట్టింది. అయినప్పటికీ దేశంలోనే పట్టుగూళ్ల ఉత్పత్తిలో ఈ ప్రాంతానికి ప్రత్యేక స్థానం ఉంది. ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాల్లోని పట్టు రైతులతో పాటు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు చెందిన పట్టు రైతులు తమ పట్టు గూళ్లను ఇక్కడికి తీసుకొచ్చి విక్రయాలు సాగిస్తుంటారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడం పట్ల పట్టు రైతులు, రీలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నూతన నిర్మాణాల్లో పట్టు గూళ్లవిక్రయాలకు అధునాతన సౌకర్యాలు కల్పించడంతోపాటు పట్టు రైతులు విశ్రాంతి తీసుకోవడానికి ప్రత్యేక గదులు, క్యాంటీన్ తదితర సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఏదేమైనా దివంగత ఎన్టీ రామారావు ప్రారంభించిన ఈ పట్టు గూళ్ల విక్రయ కేంద్రాన్ని మరింత బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం రాష్ట్ర వాట కింద రూ.4కోట్లు నిధులు మంజూరు చేసిన వెంటనే నూతన మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన మార్కెట్ నిర్మాణానికి నిధులు మంజూరు పట్ల పట్టు రైతులు, రీలర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## అధికార పార్టీ నేతల కనుసన్నల్లో అధికారులు..!

**పాఠశాల పరిశీలనలో ఎస్ఎఫ్ఐ నాయకులు**

ఎంజిఎం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలన చేస్తున్న ఎస్ఎఫ్ఐ బృందం

**ప్రజాశక్తి-హిందూపురం**

పట్టణంలోని ఎంజిఎం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించింది. దీంతో విద్యార్థులు తినక పోవడంతో చేసిన అన్నాన్ని బోజన ఏజన్సీ నిర్వహకులు పశువులకు తరలిస్తున్నారు. ఇది కూడా బాలల దినోత్సవం రోజునే చోటు చేసుకుంది. దీంతో ఈ విషయాన్ని ప్రజాశక్తి 'బాలల దినోత్సవం రోజునా చిన్నారుల పస్తులు' అనే శీర్షికతో ప్రత్యేక కథనాన్ని ప్రచురితం చేసింది. దీనిపై అధికార పార్టీ నేతల కనుసన్నుల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు మూడు రోజులు గడిచినా ఏ ఒక్కరూ స్పందించ లేదు. సోమవారం నాడు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలితో పాటు నాయకులు కలిసి ఎంజిఎం పాఠశాలలో మధ్యాహ్న బోజనాన్ని పరిశీలన చేశారు. అన్నం ముద్దగా చేయడంపై ఏజెన్సీ నిర్వహకులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి భోజనాన్ని మీ ఇంట్లో మీ పిల్లలకు ఇస్తారాని ప్రశ్నించారు. దీనిపై ఏజెన్సీ నిర్వహకులు స్పందిస్తూ తమకు ఇస్తున్న బియ్యం సరిగా లేవని, అందువల్లే అన్నం ముందుగా మారుతోందన్నారు. అనంతరం ఈ విషయంపై పాఠశాల హెచ్ఎంను ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశ్నించారు. ఎంజిఎం పాఠశాలలో నాణ్యతగా మధ్యాహ్న భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు స్పందించకుంటే పాఠశాల వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ పరిశీలనలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆఫ్రిద్, జైచంద్ర, సాకిబ్, యాసీన్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికల భద్రత సామాజిక బాధ్యత

**ప్రజాశక్తి-రొద్దం**

బాలికల భద్రత సామాజిక బాధ్యత అని అధికారులు తెలిపారు. ఆర్‌డిటి, ఐసిడిఎస్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బాలల హక్కుల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పెనుకొండ సిడిపిఒ డాక్టర్ శాంతలక్ష్మి, తహశీల్దార్ నాగేం ద్ర, ఎంపిడిఒ రామ్‌కుమార్, ఎస్ఐ నరేంద్ర, మండల వైద్యాధికారి సోమశేఖర్, ఎస్ఎంసి ఛైర్మన్ కిష్టప్ప హాజరయ్యారు. సిడిపిఒ మాట్లాడుతూ బాలలు జాతీయ సంపద అని, వారిని, వారి హక్కులను కాపా డాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాలలు కూడా హక్కులు, బాధ్యతలు తెలుసుకొని భవి ష్యత్తులో అత్యున్నత స్థాయికి ఎదగాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరి ణామాలు, చట్టాలను వివరించారు. ఆర్‌డిటి మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ మాట్లాడు తూ ఆర్‌డిటి సంస్థ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఏటా బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహిస్తుందన్నారు. చివరగా చిన్నారులకు నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీల విజేతలకు బహుమ తులు అందజేశారు. అంతకుముందు చిన్నారులు ఆర్.మరవపల్లి గ్రామ కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమం లో కెజిబివి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సుశీలమ్మ, బోధన సిబ్బంది, ఆర్‌డిటి కౌన్సిలర్ నాగలక్ష్మి, సిఒ రామాంజ నేయులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అనురాధ, సుజాతమ్మ, వైద్య సిబ్బంది గిరినాథ్‌రావు, ఎస్ఐ నరేంద్ర, రూపా, న్యాయ విద్యార్థి ప్రవీణ్‌కుమార్, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొ న్నారు.

**లైంగిక వేధింపులపై జాగ్రత్తగా ఉండాలి**

**ధర్మవరం రూరల్ :** జిల్లా బాలల పరిరక్షణ సమితి, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపేట బాలికల ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సిడిపిఒ లక్ష్మీ మాట్లాడుతూ సమాజంలో ఏదో ఒక చోట బాలలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయని, వాటి పట్ల ప్రతి బాలిక జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే పలు జాగ్రత్తలను తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమం లో జిల్లా బాలల పరిరక్షణ సమితి రక్షణ అధికారి నాగలక్ష్మ, సిఐఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప, సూపర్‌వైజర్లు అరుణ, మణిమాల, లతాకిరణ్, హెచ్ఎం మేరీ, ఉపాధ్యాయులు రమేశ్, శారద, పిల్లలు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

రొద్దంలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, అధికారులు

# గ్రీవెన్స్ అర్జీలపై నిర్లక్ష్యం వద్దు : కలెక్టర్

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహిం చిన గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 195 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డిఆర్‌ఒ విజయ సారథి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, డిఆర్‌డిఎ పిడి నరసయ్య, గృహ నిర్మాణ శాఖ పిడి వెంకటనారాయణ, డిపిఒ సమత, తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని పరిశీలించి రీ ఓపెన్ కాకుండా పరిష్కరించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే వివిధ పథకాల అమలు, స్వర్ణాంధ్ర-2047 అమలుపై నివేదికలతో సిద్ధంగా ఉండాలన్నారు. నవంబర్ 19వ తేదీ ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవం నిర్వహించాలన్నారు. మరుగుదొడ్డి నిర్మాణాలు వేగవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. విద్యార్థుల కోసం ఈ అపార్ గుర్తింపు కార్డులు జారీ చేయాల్సి ఉంటుందని వెంటనే సంబంధిత అధికారులు అమలు పరచాలన్నారు. ఈ గుర్తింపు కార్డు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు.

**కిశోర్ బాలిక వికాసం శిక్షణ కరదీపిక విడుదల**

కిశోర్ బాలిక వికాసం కోసం వస్తున్న శిక్షణ బాలికలకు ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో శిక్షణ కరదీపిక, పత్రికలను కలెక్టర్ విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ బాలికల హక్కులను గుర్తించి, వారి అవసరాలను తీర్చినప్పుడు బాలికలు వారి కుటుంబాలను మార్చగలరన్నారు. ఆరోగ్యం, పౌష్టికాహారం, మానవ అక్రమ రవాణా, లైంగిక దాడులు, బాల్య వివాహాలు, తదితర అంశాలపై శిక్షణలో వివరించవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు సుధ, వరలక్ష్మి, మహేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టిఎస్.చేతన్

# ఘనంగా కనకదాస జయంతి

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

కురుబ సామాజిక వర్గం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో భక్త కనకదాస జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక ఎర్రగుంట కూడలి వదరున్న కురుబ కళ్యాణ మండపం నుంచి కురుబలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాజ్యోతి సర్కిల్‌లో ఉన్న కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపి విత్తనాభివృద్ధి సంస్థ రాష్ట్ర డైరెక్టర్ కమతం కాటమయ్య, కురుబ కళ్యాణమండపం ప్రెసిడెంట్ మాలగుండ్ల మల్లికార్జున, కార్యదర్శి కప్పల బలరాముడు, ట్రెజరర్ బండి ఉజ్జినప్ప, ఉపాధ్యక్షులు కోటి వెంకటేష్, గవ్వల నారాయణస్వామి, గిరక నారాయణస్వామి, బత్తలపల్లి ఉపసర్పంచి కోటి నరేష్, కోటి సురేష్, కౌన్సిలర్ కత్తె పెద్దన్న, బిసి సంఘం పట్టణ అధ్యక్షులు బండి వెంకటేష్, గొట్లూరు కపాడం శీశ, దాసరి రామశేషు, అనిల్, గవ్వల బాబు, అడ్రా మహేష్, బిల్లే శ్రీనివాసులు, పోతుకుంట రమేష్, యజ్జన్న, రాజా, బండి నారాయణస్వామి, పూజారి నరసింహులు, ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ కపాడం ఈశ్వరయ్య, కార్యదర్శి చంద్ర, శ్రీకాంత్, పృథ్వీరాజ్, దేవర సత్తి, పసులూరి నారాయణస్వామి, తరికి నరసింహులు, కత్తె కిష్ట, లక్ష్మీనారాయణ, కప్పల రాము, నాగార్జున, తరికి శేఖర, కమతం ఈశ్వరయ్య, కోటి హర్షవర్ధన్, కప్పల అశోక్, మహేష్ పాల్గొన్నారు.

కనకదాస జయంతి వేడుకల్లో పాల్గొన్న కురుబలు, నాయకులు

# ప్రభుత్వ పాఠశాలకు ఎన్ఆర్ఐ సహకారం

**ప్రజాశక్తి-సోమందేపల్లి**

మాతృభూమికి తన వంతు సేవ చేయాలనే తపనతో అమెరికాలోని కాలిఫోర్నియాలో నివాసం ఉంటున్న నవీన్‌రెడ్డి కుమారుడు నతన్‌రెడ్డి అల్లిపేట చల్లాపల్లి ప్రభుత్వ పాఠశాలలకు తన వంతు సహకారం అందిస్తున్నారు. వివరాలు.. నవీన్‌రెడ్డి స్వగ్రామం హిందూపురం మండలంలోని మిట్టమీద పల్లి గ్రామం. ఈయన కాలిఫోర్నియాలో నివాసం ఉంటున్నారు. అతని కుమారుడు నతన్‌రెడ్డి(17) అక్కడే చదువు కుంటున్నాడు. ఇతను తన మిత్రుడైన శిరీష్ గోయల్‌తో కలిసి 'క్లాత్ ఫర్ కేర్' స్వచ్ఛంద సంస్థను స్థాపించి పేదలకు సహాయ సహకారాలు అందిస్తుంటారు. గతేడాది గోరంట్ల పాఠశాలకు క్రీడాసామగ్రి అందజేశారు. మండలంలోని చల్లపల్లి గ్రామానికి చెందిన వారి బంధువులు భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, రంగారెడ్డి సూచనల మేరకు సోమవారం చల్లాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులకు క్రీడా డ్రస్, షూస్, క్రికెట్, వాలీబాల్ క్రీడలకు సంబంధించిన సామగ్రి అందజే శారు. నతన్‌రెడ్డి తాత భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ నతన్‌రెడ్డి చిన్న వయసులోనే మాతృభూమికి తన వంతు సేవ చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఈ క్రీడా సామగ్రిని సద్వినియోగం చేసు కుని క్రీడల్లో రాణించినప్పుడే నతన్‌రెడ్డి ఆశయం నెరవేరుతుందని తెలిపారు. నతన్‌రెడ్డికి ఉపాధ్యా యులు, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శోభ, ఫిజికల్ డైరెక్టర్ అలివేలమ్మ, వెంకటేష్‌కుమార్, పరిమళ, దస్తగిరి, ఓబులేష్, రియాజ్‌బాషా, ఆసిఫా, లక్ష్మానాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

నతన్‌రెడ్డి తరపున విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న కుటుంబ సభ్యులు

చెరువు గండిని పూడ్చిన అధికారులు, నాయకులు

## చెరువు గండి పూడ్చివేత

**ప్రజాశక్తి-గాండ్లపెంట**

మండలంలోని తూపల్లి పంచాయతీ సమీపంలోని మడుగువారుగొంది చెరువుకు గండి పడగా ఆదివారం రాత్రి గ్రామస్తుల సహకారంతో పూడ్చినట్లు ఇరిగేషన్ జేఈ అరుణ, తహశీల్దార్ బాబురావు తెలిపారు. వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మడుగువారు గొంది చెరువుకు గండిపడిందన్నారు. దీంతో గ్రామస్తులు, అధికారులు, టిడిపి నాయకుల సహకారంతో చెరువు గండిని జెసిబి, ట్రాక్టర్లతో పూడ్చినట్లు తెలిపారు. ఈ చెరువు కింద 25 మంది ఆయకట్టుదారులు ఉన్నట్లు తెలిపారు. పురాతన చెరువు కావడంతో గండి పడిందని, మరమ్మతులకు నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు పంపామని తెలిపారు. మండలంలో ఎక్కడా చెరువులకు గండి పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో అమనుల్లా, టిడిపి మండల కన్వీనర్ సి.కొండయ్య, గ్రామస్తులు సిద్ధారెడ్డి, రమణప్ప, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని శైలజతో ప్రిన్సిపల్ కిరణ్

## జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

**ప్రజాశక్తి-కదిరి అర్బన్**

గత అక్టోబర్‌లో గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన ఎస్‌జిఎఫ్ఐ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా తరపున పట్టణంలోని హరీష్ పాఠశాల విద్యార్థిని కె.శైలజ ప్రతిభ చాటిందని ప్రిన్సిపల్ కిరణ్ తెలిపారు. 8వ తరగతి విద్యార్థి కె.శైలజ ఛత్తీస్‌ఘడ్‌లోని రాయపూర్‌లో ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకూ జరిగే జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. శైలజను ప్రిన్సిపల్‌తో పాటు ఉపాధ్యాయులు, పిఇటి ప్రసన్నకుమార్, ఖాదర్‌వలి అభినందించారు.

# సమాజంలో మార్పు కోసం కనకదాస కృషి

**ప్రజాశక్తి-బుక్కపట్నం**

సమాజంలో మార్పు కోసం భక్త కనక దాస చేసిన కృషి ఎనలేనిదని కురబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. కనకదాస జయంతి సందర్భంగా సోమవారం కనకదాస విగ్రహానికి కురుబ సంఘం ఆధ్వర్యంలో పూలమా లలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లా డుతూ సమాజంలో మార్పు కోసం కనకదాస ఎంతో కృషి చేశారన్నారు. కవి, సంఘసంస్కర్త అయిన కనకదాస నేటితరానికి ఆదర్శప్రాయుడని తెలిపారు. అనంతరం కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కత్తి నాగరాజు, ఈశ్వరయ్య, అశోక్, సామకోటి రాజు, మంజునాథ్, ఓబులేసు, కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు.

శ్రీనివాసులును సన్మానిస్తున్న కురుబ సంఘం నాయకులు

**హిందూపురం :** శ్రీ భక్త కనకదాసు జయంతి వేడుకలను సోమవారం కురుబ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, మున్సిపల్ డిలిగేట్ ఛైర్మన్ బలరామిరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు అంజినప్ప, పట్టణ అధ్యక్షులు రమేష్ కుమార్ కనకదాసు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

## విద్యార్థుల కోసం ప్రత్యేక 'ఆధార్' కేంద్రం

**ప్రజాశక్తి-లేపాక్షి**

మండల వ్యాప్తంగా విద్యార్థుల కోసం ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకూ స్థానిక నీలం సంజీవరెడ్డి ఉన్నత పాఠశాలలో ప్రత్యేక ఆధార్ కేంద్రం ప్రారంభిస్తామని ఎంఇఒ నాగరాజు నాయక్ తెలిపారు. మండలంలోని ప్రధానోపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పెండింగ్ ఉన్న విద్యార్థుల ఆధార్‌ను అప్‌డేట్ చేయించాలని తెలిపారు.

## బిసి హాస్టళ్ల విద్యార్థులకు దుప్పట్లు

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**

జిల్లా వ్యాప్తంగా బిసి హాస్టళ్లలోని విద్యార్థులకు దుప్పట్లు వచ్చాయని, వాటిని పుట్టపర్తి బాలుర బిసి హాస్టల్‌లో నిల్వ ఉంచామని అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ సుబ్బరాయుడు తెలిపారు. ఆయన మాట్లాడుతూ దుప్పట్లను డివిజన్ల వారీగా ఆయా హాస్టళ్ల వార్డెన్లకు పంపిణీ చేస్తామన్నారు. కొన్ని హాస్టల్లో ఇదివరకే పంపిణీ చేశామన్నారు. వార్డెన్లు విద్యార్థికి ఒక దుప్పటి చొప్పున ఇస్తారని తెలిపారు. అనంతరం బుక్కపట్నం, కొత్తచెరువు, నల్లమాడ మండలాలకు దప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు పుట్టపర్తి-గోపాల్, బుక్కపట్నం-లలిత, కొత్తచెరువు-నాగేంద్రసింగ్, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి నుంచి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్న దుప్పట్లు

## ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాశక్తి-కొత్తచెరువు**

2024-25 విద్యా సంవత్సరానికి ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం కోసం ఈ నెల 26వ తేదీ లోపు తత్కాల్‌లో అడ్మిషన్ చేసుకోవాలని డిఇఒ జి. కిష్టప్ప తెలిపారు. 14 ఏళ్లు పైబడిన వారు ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

# ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండండి : డీఎస్పీ

**ప్రజాశక్తి-తనకల్లు**

గ్రామాల్లో ప్రజలు ఫ్యాక్షన్ గొడవలకు దూరంగా ఉండాలని కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి సూచించారు. డీఎస్పీ సోమవారం మండలంలోని కొక్కంటి గ్రామ పంచాయతీలో పర్యటించి గ్రామస్తు లతో సమావేశమయ్యారు. మహిళలు, చిన్నపిల్లలపై జరిగే నేరాలు, వాటి నియంత్రణపై తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీసులకు తెలిపారు. గంజాయి, అక్రమ మద్యం, జూదం, కోడి పందేలు, తదితర సంఘ విద్రోహ చర్యల గురించి తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. డీఎస్పీ వెంట ఎస్ఐ గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడతున్న డీఎస్పీ శివనారాయణస్వామి

## వృద్ధాశ్రమంలో అన్నదానం

**ప్రజాశక్తి-మడకశిర**

మండలంలోని అమిదాలగొంది గ్రామంలో ఉన్న శ్రీవేంకటేశ్వర వృద్ధాశ్రమంలో సోమవారం దాతలు దుస్తులు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారున. పావగడ తాలూకా లింగదహళ్లి గ్రామానికి చెందిన వాసవీ హార్డ్‌వేర్ యజమాని కె.నాగరాజుశెట్టి, నాగజ్యోతి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆశ్రమంలోని 25మంది వృద్ధులకు దుస్తులు పంపిణీ చేసి, అన్నదానం ఏర్పాటు చేశారు. దాతలకు ఆశ్రమం అధ్యక్షుడు తిమ్మారెడ్డి అభినందనలు తెలిపారు.

# విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**ప్రజాశక్తి-రొద్దం**

57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం శాఖా గ్రంథాలయ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో టీచ్ హైస్కూల్, జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వ్యాసాలు రాయడం, అవగాహన చేసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీచ్ హైస్కూల్ తిమ్మారెడ్డి, ఆయా స్కూల్‌ల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**చిలమత్తూరు :** స్థానిక జడ్పీ, పొట్టి శ్రీరాములు హైస్కూళ్లలో ఇన్‌ఛార్జి హెచ్ఎం పద్మ, రాఘ వేంద్ర, గ్రంథాలయ అధికారి మల్లికార్జున ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, స్పోర్ట్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని తెలిపారు.

**ఓబుళదేవరచెరువు :** ప్రజల్లో చైతన్యం తేవడానికి గ్రంథాలయాలు దోహదపడతాయని గ్రంథా లయ అధికారి రాజాబాబు తెలిపారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు తరగతుల వారీగా కబడ్డీ, వాలీబాల్, పరుగు, ఖోఖో, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు ఈ నెల 20వ తేదీ బహుమతులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శోభారాణి, పిడి గోపీనాథ్ పాల్గొన్నారు.

**కొత్తచెరువు :** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు స్థానిక గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల, జడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి వెంకటరమణ తెలిపారు. విజేతలకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. గ్రంథాలయాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శివయ్యచౌదరి, నాగరత్నమ్మ, అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**తనకల్లు :** స్థానిక ఎంపియుపి ఉర్దూ స్కూల్‌లో వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్, క్రీడ, తదితర పోటీలు నిర్వహించారు. విశ్రాంత లైబ్రేరియన్ ఇమామ్‌సాబ్, ఉపాధ్యాయులు అలి మాట్లాడు తూ ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం అలవడుతుందని, పలు అంశాలపై అవగాహన పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎస్.మస్తాన్‌వలి, ఉపాధ్యా యులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

**కదిరి టౌన్ :** పట్టణంలోని శాఖా గ్రంథాలయం తరపున స్థానిక మున్సిపల్ రాణిపేట పాఠశాల లో విద్యార్థులకు గ్రంథాలయం ఆవశ్యకతపై వ్యాసరచన, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం జనార్ధన్, ఉపాధ్యాయినులు జానకి, అంజనమ్మ, గ్రంథాలయ అధికారి కృష్ణ కిషోర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

చిలమత్తూరులో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

# సంస్కృతి కళాశాల ముందు విద్యార్థి సంఘాల ధర్నా

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**

విద్యార్థి మృతికి కారణమైన సంస్కృతి కళాశాల యాజమాన్యంపై తక్షణం చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కళాశాల ప్రధాన గేటు ముందు బైఠాయించి యాజమాన్యం నిరంకుశ వైఖరి విడనాడాలని నినాదాలు చేశారు. ఎఐఎస్‌పి రాష్ట్ర కన్వీనర్ నరసింహ, పిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు నరేంద్ర, ఎఐఎస్‌ఒ జిల్లా కార్యదర్శి నిరంజన్, ఎన్ఎస్ యుఐ గణేష్, ఎపిఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శివ మాట్లాడుతూ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న ప్రేమ్‌సాయి మృతి చెందాడని మండిపడ్డారు. ధర్నా విషయం తెలుసుకుని అర్బన్ సిఐ సునీత అక్కడికి వెళ్లి వారిని అక్కడి నుంచి పంపించేశారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయని నేపథ్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా ఎస్పీ వి.రత్నకు ఫిర్యాదు చేశారు.

సంస్కృతి కళాశాల ముందు ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

# గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి : ఈఈ

**ప్రజాశక్తి -ధర్మవరం రూరల్**

ధర్మవరం డివిజన్‌తో పాటు పట్టణ పరిధిలో ప్రభుత్వం పేదలకు కేటాయించిన స్థలాల్లో లబ్ధిదా రులు వెంటనే నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ ఈఈ శంకర్‌నాయక్ కింది స్థాయి అధికారులను ఆదేశించారు. ఈఈ సోమవారం రేగాటిపల్లి జగనన్న లేఅవుట్ లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇంటి పట్టాల్లో ప్రతి లబ్ధిదారుడు ఇంటి నిర్మా ణం వెంటనే చేపట్టాలని తెలిపారు. అలాగే ఇంతవరకూ ఎటువంటి నిర్మాణానికి నోచుకోని లబ్ధిదారులకు నోటీసులు ఇస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు జూన్ 4 నుంచి డిసెంబర్ 20వ తేదీ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇళ్ల నిర్మాణం ధ్యేయంగా గృహనిర్మాణ అధికారులు ఈ కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ బాలకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

**ప్రజాశక్తి-కొత్తచెరువు**

మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన గంగాద్రి కుమారుడు నరసింహులు(35) సోమవారం విద్యుదాఘాతాకి గురై మృతిచెందాడు. వివరాలు.. మోటార్ మెకానిక్ అయిన నరసింహు లు మధ్యాహ్నం 3 గంటల సమయంలో గ్రామ సమీపంలోని కుంటెమ్మ ఆలయం వద్ద విద్యుత్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ షాక్‌కు గురై అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో అక్కడే ఉన్న వారు హుటాహుటిన 108 సాయంతో కొత్తచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న కుమారుడిని కోల్పోవ డంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు కొత్తచెరువు ఇన్‌ఛార్జి సిఐ సురేష్ తెలిపారు.

నరసింహులు (ఫైల్‌ఫోటో)

# స్కీం వర్కర్ల సమస్యలపై 25న ధర్నా : సిఐటియు

**ప్రజాశక్తి-హిందూపురం**

ప్రభుత్వ స్కీంలో పని చేస్తున్న వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25వ తేదీ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. అలాగే స్కూల్ స్వీపర్ల సమస్యలపై ఎంఇఒ గంగప్పకు వినతి పత్రం ఇచ్చారు. సిఐటియు పట్టణ నాయకులు విఆర్.రాము మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా స్కూల్ స్వీపర్లు 30 ఏళ్ల నుంచి చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారని తెలిపారు. వారి సమస్యలపై ఈ నెల 25వ తేదీ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వీపర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సరోజమ్మ, షాహీన, సాదిదా, హుస్సేన్, బి.రత్నమ్మ, అశ్విని, నిర్మల, ఫరీద, హసీనా, జహీరా, తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒ గంగప్పకు వినతి పత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

# హౌసింగ్ బిల్లుల అవకతవకలపై ఫిర్యాదు

**ప్రజాశక్తి-తనకల్లు**

ఎటువంటి నిర్మాణాలు జరగకనే బిల్లులు మంజూరు చేసిన గృహ నిర్మాణ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిపిఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాల యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతి పత్రం ఇచ్చారు. సిపిఎం నాయకులు రమణ, శివన్న, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ తోపు పరమేష్ మాట్లాడుతూ మండలంలోని చీకటిమానిపల్లి, బొంతలపల్లి, బాలసముద్రం, తవలం, తదితర గ్రామాల్లో ఒక్కో ఇంటికి సుమారు రూ. 40వేల చొప్పున బిల్లులు చేశారన్నారు. అక్రమంగా బిల్లులు చేసిన అధికారులపై కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం, రైతు సంఘం నాయకులు

## 'పది' పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

**ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్**

పదో తరగతి విద్యార్థుల ఫీజు చెల్లింపు గడువును ఈ నెల 26వ తేదీ వరకూ పొడిగించారని, జిల్లాలోని అన్ని యాజమాన్యాల గుర్తింపు పొందిన ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గమనిం చాలని డిఇఒ కృష్ణప్ప తెలిపారు. రూ. 50 అపరాధ రుసుముతో డిసెంబర్ 2, రూ. 200 రుసుంతో డిసెంబర్ 9, రూ. 500 రుసుంతో డిసెంబర్ 16వ తేదీ వరకూ అవకాశం ఉందన్నారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు రూ. 125, 3 సబ్జెక్టుల లోపు రూ. 110, ఒకేషనల్ స్టూడెంట్స్ రూ. 60 అదనంగా చెల్లించాలని డిఇఒ తెలిపారు.

# అహుడా ఛైర్మన్‌ను కలిసిన జనసేన నాయకులు

**ప్రజాశక్తి-రొద్దం**

అనంతపురం-హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అహుడా) ఛైర్మన్‌గా నియమి తులైన అనంతపురం జిల్లా జనసేనపార్టీ అధ్యక్షులు టిసి.వరుణ్‌ను సోమవారం జనసేన పార్టీ మండల నాయకులు జుబేర్ అనంతపురంలోని అహుడా కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభా కాంక్షలు తెలిపారు. వరణ్‌కు ఛైర్మన్ పదవి ఇవ్వడం పట్ల కూటమి ప్రభుత్వానికి, జనసేనపార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పెనుకొండ పట్టణ ఇన్‌ఛార్జి పి.లోకేష్, నియోజకవర్గ నాయకులు జుబేర్, మండల సీనియర్ నాయకులు నరహరి, వినోద్, శివశంకర్, తదితరులు ఉన్నారు.

అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్‌ను సన్మానం చేస్తున్న జుబేర్

## సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

**ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్**

శ్రీసత్యసాయిబాబా జయంతి వేడుకల్లో భాగంగా సోమవారం ప్రశాంతి నిలయంలో సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ ప్రారంభించారు. గ్లోబల్ మెడికల్ కౌన్సిల్ ఇన్‌ఛార్జి మోహన్‌రావు, సత్యసాయి ఎపి మెడికల్ ఇన్‌ఛార్జి సాయికృష్ణ మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ వరకూ వైద్య శిబిరం నిర్వహిస్తామని, ఇందులో మొత్తం 60మంది వైద్య నిపుణులు సేవలు అందిస్తారని తెలిపారు. అలాగే వృద్ధులకు చేతి కర్రలు, కంటి అద్దాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి అక్షయ్‌జైన్, గీతాకామత్, తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య సేవలు అందస్తున్న వైద్యులు

## 'గుండుమల'కు సన్మానం

**మడకశిర :** తుమకూరు జిల్లాలోని ఎల్లాపురంలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిని టెక్నికల్ అసిస్టెంట్ మంజునాథ్ దంపతులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామారావు, నాయకులు చంద్రప్ప, బసవరాజు, బిఎస్.గురుమూర్తి, కొత్తపాలెం శీనప్ప, హెచ్.గోవిందప్ప, ఉపాధ్యాయులు భూతన్న, జోగప్ప, సూర్యనారాయణ, రవికుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు జగదీష్, తిరుమలగౌడ్, దివాకర్, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE DISTRICT JUDGE: ANANTAPURAMU.**

**E.P. No.3/2023 in ARB Case No: ARC/FSBFL/294**

Between:
M/s. Five Star Business Finance Limited, Anantapur represented by its Authorized Signatory Y.Shyam Prasad, Anantapur ...Petitioner/ D.Hr

Vs

1.Vajrala Anjinamma D/o Thirupal
2.V.Srinivasulu S/o Thirupal
3.V.Thirupal S/o Narayanappa
All are R/at, D.No.16/46/4D, Bestha Street, Kutagulla (Vi) Kadiri Mandal, Sri satya Sai Dist. ...Respondents/J.Drs

**వేలం ప్రకటన**

అర్జీదారుడు తన ఇ.పి. మొత్తమును రాబట్టుటకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చియున్నాడు. వేలములో పాల్గొనదలచనివారు 27/11/2024 వ తేది ఉ॥ 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలములో పాల్గొనవచ్చును.

**SCHEDULE:**

The property is situated in R.D Hindupur and SRD of Kadiri, within the limits of Kutagulla Village, Kadiri Municipality and Mandal, Sri Satya Sai District.

| Sy.No. | Extent | D.No. | Assessment |
|---|---|---|---|
| 410-1 | 48 Sq.yards | 16-87 | 1005007449 |

**Boundaries:** **East by:** Rastha, **West by:** Rastha, **North by:** House of S.Nagabhushana, **South by:** Rastha.

**Measurements:** East-West:24 feet or 7.320 meters, North-South:18 feet or 5.490 meters. Totally measuring **48 Sq.Yards or 432 sq.feet**

DHr Value Rs.10,00,000/-

Amina Value: Rs.20,00,000-00

**(By Ordr of the Court)**

**M.Suresh Kumar**
**Advocate for DHr.**
**Anantapuramu, Cell: 9441168233.**